క్లుప్తంగా

బైక్‌ను ఢీకొట్టిన కారు.. వ్యక్తికి గాయాలు

గద్వాల క్రైం: కారు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలపాలైన ఘటన గద్వాల మండలం వీరాపురం స్టేజీ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... ధరూర్ మండలం రేవులపల్లి (డ్యాం)కు చెందిన మనోజ్ ఎర్రవల్లి నుంచి బుల్లెట్ బైక్‌పై గద్వాలకు వస్తున్నాడు. ఈ క్రమంలో కర్ణాటకకు చెందిన కారు ముందు వెళ్తున్న బైక్‌ను వేగంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో మనోజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంలో కారు, బైక్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాదంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

అత్యవసర సేవలైనా.. ఆగాల్సిందే



ఉండవెల్లి: మండలంలోని జోగుళాంబ రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన రైల్వేగేట్‌తో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకల నేపథ్యంలో గేట్ వేశారు. దీంతో 108 అంబులెన్స్ గేట్ వద్ద నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సేవలకు కూడా ఆటంకం కలుగుతుంటే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వే స్టేషన్ వద్ద ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఉండవెల్లి: మండలంలోని బొంకూరు టోల్‌ప్లాజాలో పని చేస్తున్న రవి అనే వ్యక్తి ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో శనివారం బాధిత కుటుంబ సభ్యులను టోల్‌ప్లాజా సిబ్బంది పరామర్శించారు. అనంతరం రవి భార్య లోకప్రియకు రూ.36 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అండగా ఉంటామని హామీనిచ్చారు.

నాయకుల పరామర్శ

గట్టు: మండల కేంద్రానికి చెందిన తోళ్ల ఇస్మాయిల్ కుటుంబ సభ్యులను పలువురు శనివారం పలువురు నాయకులు పరామర్శించారు. తోళ్ల ఇస్మాయిల్ శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు బల్గెర హనుమంతునాయుడు, అంగడి బస్వరాజు, రామునాయుడు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహబూబ్‌పాష బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలా క్షేత్రం



మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా అర్చకులు మధుసూదనచారి, రమేషాచారి, రవిచారి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు. అదే విధంగా సద్దలోనిపల్లి కృష్ణ స్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్పస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, సీతారామిరెడ్డి, రామచంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూర్: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో ఈ నెల 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ నరేందర్ అన్నారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, చీటింగ్, కొట్లాటలు, భూ తగాదాలు, భార్యభర్తల గొడవలు, అక్రమ రవాణా, పేకాట, తదితర కేసులకు సంబంధించి కక్షిదారులు లోక్ అదాలత్‌లో రాజీ కావొచ్చని తెలిపారు.

కొనుగోలు పేరిట కొల్లగొట్టారు

- గన్నీ బ్యాగులు అందించడంలోనూ కక్కుర్తి
- లారీ కదలాలంటే తరుగు పేరుతో వసూలు
- కొనుగోలు కేంద్రాల్లో దోపిడీకి గురైన రైతన్నలు
- ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న దళారుల లీలలు



మాన్‌దొడ్డిలో లారీలో లోడ్ చేస్తున్న ధాన్యం బస్తాలు

రాజోళి: రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అధికారుల పర్యవేక్షణ లేక రకరకాల వసూళ్ల పేరుతో రైతులను దళారులు కొల్లగొట్టారు. నిన్న మొన్నటి దాకా వసూళ్ల గురించి బయటకు చెబితే ధాన్యం కొనుగోలు ఆలస్యం చేస్తారని భావించిన అన్నదాతలు కొనుగోలు ముగిశాక ఒక్కొక్కటిగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ఎటు చూసినా నష్టమే

రాజోళి మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రాజోళి, పెద్దధన్వాడ, మాన్‌దొడ్డి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ ధాన్యం కొనేందుకు అధికారులు పెట్టిన కొర్రీలు అన్నీ ఇన్నీ కాదని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు, దళారులు కలిసే తరుగు పేరుతో దోచుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు కుప్పలు పోసుకున్న ధాన్యాన్ని తీసుకెళ్లేందుకు వచ్చిన లారీల్లో ధాన్యం బస్తాలు లోడ్ చేశాక తరుగు పేరుతో దండుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అయితే తరుగు పేరుతో బస్తాలను తూకం వేసే ముందే తరుగు తీశారని, లారీలో లెక్క తేడా ఉందని మొత్తంలో మళ్లీ తరుగు తీశారని రైతులు ఆరోపిస్తున్నారు.

దళారుల దోపిడీ

పీఏసీఎస్‌లో పనిచేసే సిబ్బంది కొందరు దళారలతో కలిసి చేసిన అక్రమాలు ఒక్కొక్కొటిగా రైతులు పేర్కొంటున్నారు. ధాన్యం కుప్పలు పోసుకున్న క్రమంలో వాటిని నింపి లోడ్ చేసేందుకు గన్నీ బ్యాగులు అందుబాటులో లేవని అధికారులు రైతులకు చెప్పడంతో రైతులు ఆందోళన చెందారు. ఇదే అదునుగా చేసుకుని ఖాళీ గన్నీ బ్యాగు ఒక్కదానికి రూ.6 చొప్పున దళారులతో కలిసి, సిబ్బంది వసూలు చేసినట్లు వాపోయారు. లారీ వచ్చే ముందు రోజులోగా ఎవరు ముందుగా డబ్బులు ఇస్తే, ఎన్ని బ్యాగులకు డబ్బులకు ఇస్తే అన్ని బ్యాగులను అందజేసి ఆ రైతుల ధాన్యం లోడ్ చేసినట్లు పేర్కొంటున్నారు. ఇది తెలియక చాలా మంది పడిగాపులు కాస్తుంటే, దళారులు రంగ ప్రవేశం చేసి గన్నీ బ్యాగుకు ఇంత ఇస్తే మీ ధాన్యం కూడా లోడ్ అవుతుందని చెప్పి డబ్బులు దండుకుని ధాన్యం కొనుగోలు చేశారు.

బోనస్ పేరుతో వసూలు

బోనస్ డబ్బులు పడతాయని రైతుల నుంచి మామూళ్లు వసూలు చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రైతులను రకరకాల పేర్లతో నిలువు దోపిడి చేశారని, గతంలో దీనిపై మీడియాకు, అధికారులకు సమాచారమిచ్చిన రైతుల ధాన్యం కొనుగోలు చేయడంలో కక్ష్యపూరిత ధోరణితో వ్యవహరించారని మండల రైతులు పేర్కొన్నారు. రైతుల నుంచి రూ. లక్షల్లో దళారులు దోచుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బోనస్ డబ్బులు వేస్తుందని, కొనుగోలు సులువు చేస్తామని దళారులను కేంద్ర సిబ్బందే అక్రమాలను పెంచి పోషిస్తున్నారని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం మండలంలో రెండు చోట్ల కొనుగోలు ముగిసినప్పటికీ, మాన్‌దొడ్డిలో శనివారం మందకొడిగా సాగింది. కానీ అధికారులు స్వార్థంతో చేసిన కొనుగోళ్ల దందాలో రైతులే నష్టపోయామని, దీనిపై జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలోకి దర్యాప్తు చేపడితే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరిగిన దోపిడీని వెల్లడిస్తామని రైతులు పేర్కొన్నారు.

సంచులకు వసూలు చేశారు

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సిబ్బందితో కలిసి ఖాళీ గన్నీ బ్యాగుకు ఒక్కో దానికి రూ. 6 చొప్పున వసూలు చేశారు. బ్యాగులు లేవనే సాకుతో ఈ దందాకు తెరలేపారు. డబ్బులు లేని వాళ్ల ధాన్యం తడిసి నష్టపోయారు. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బందితో కలిసి దళారులు దోచుకున్నారు.

- వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు మాన్‌దొడ్డి

దళారులే బాగు పడ్డారు

ధాన్యం అమ్మిన రైతుల కంటే దళారులే బాగు పడ్డారు. కొంత మంది సిబ్బంది కూడా దళారులతో కలిసి సొమ్ము చేసుకున్నారు. లారీకి లోడ్ ఎత్తక ముందు తరుగు అన్నారు. లోడ్ చేశాక కూడా మొత్తం మీద తరుగు తీయాలన్నారు. తరుగు పేరిట ధాన్యం తీసి రూ.లక్షలు సంపాదించుకున్నారు.

- రాముడు, రైతు మాన్‌దొడ్డి

చర్యలు తప్పవు

రైతుల కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో దళారుల ప్రమేయం సహించం. రైతుల ఆరోపణల మేరకు తప్పకుండా విచారణ చేస్తాం. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి రైతులు నష్టపోకుండా చూస్తాం. దోపిడీలో పీఏసీఎస్ సిబ్బంది ఉన్నా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- గోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, వడ్డేపల్లి

సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా



యోగాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఇటిక్యాల: సంపూర్ణ ఇరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయాలని ఆయుష్ మండల వైద్యాధికారి ముబీనా తబాసుమ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర ఆయుష్ విభాగం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న యోగా మాసోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఆయుష్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయుష్ శాఖ నేతృత్వంలో అవగాహన సదస్సులు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యోగా బోధకులు నరేష్, శివాని, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగించుకోవాలి

గట్టు: భూ మాత రెవెన్యూ సదస్సులను ఈ నెల 3 నుంచి 20 వరకు నిర్వహించన్నట్లు తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్ తెలిపారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శనివారం గట్టు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తహసీల్దార్ వివరాలు వెల్లడించారు. 3న మల్లంపల్లి, ఆరగిద్ద, 4న పెంచికలపాడు, చమన్‌ఖాన్‌దొడ్డి, 5న తప్పెట్ల మొర్సు, ముసలంపల్లి, 6న యల్లందొడ్డి, గొర్లఖాన్‌దొడ్డి, 9న ఆలూరు, 10న రాయాపురం, 11న తుమ్మలచెరువు, 12న ఇందువాసి, 13న బోయలగూడెం, 16న చాగదోన, 17న మిట్టదొడ్డి, 18న బల్గెర, 19న మాచర్ల, 20న గట్టు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో తేదీల వారీగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. జూన్ 21 నుంచి ఆగస్టు 10 వరకు వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో విచారించి, సమస్యలను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

ధరూరు: మండలంలో ఈ నెల 3వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భూపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు బృందాలుగా ఏర్పడి మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 3న మన్నాపురం, నీలహళ్లి, 4న దోర్నాల, మీర్జాపురం, 5న అల్వలపాడు, నెట్టెంపాడు, 6న కోతులగిద్ద, నాగర్‌దొడ్డి, 9న మార్లబీడు, గార్లపాడు, 10న ఉప్పేరు, 12న చింతరేవుల, 13న ర్యాలంపాడు, జీరంబండ, 16న ఎములోనిపల్లి, చెన్నారెడ్డిపల్లి, 17న జాంపల్లి, పెద్ద చింతరేవుల, 18న ధరూరు, 19న పారుచర్ల గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

భూ భారతి చట్టంపై గ్రామసభలు

కేటీదొడ్డి: మండల వ్యాప్తంగా జూన్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు భూ భారతి చట్టంపై రైతులకు రెవెన్యూ అవగాహన సదస్సు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కేటీదొడ్డి తహసీల్దార్ హరికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న గువ్వలదిన్నె, 4న ఇర్కిచేడు, 5న ఈర్లబండ, 6న ఉమిత్యాల, 9న గంగన్‌పల్లి, 10న కుచినెర్ల, 11న చింతలకుంట, అప్పకొండహళ్లి, 12న నందిన్నె, 13న పాగుంట, ముసల్‌దొడ్డి, 16న కొండాపురం, 17న కేటీదొడ్డి, ఇసర్లపాడు 18న పాతపాలెం, వెంకటాపురం గ్రామంలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పొగాకుకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి లక్ష్మి

గద్వాల క్రైం: పొగాకుకు ప్రజలు దూరంగా ఉండాలని గద్వాల సీనియర్ సివిల్ జడ్జి టీ.లక్ష్మి అన్నారు. జిల్లా లీగల్ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జమ్మిచెడ్ గ్రామంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగాకు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. పొగాకు వినియోగంపై వచ్చే రోగాలను వివరించారు. పొగాకు వలన క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధుల బారినపడే అవకాశం ఉందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీహెచ్ పూజిత, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహణపై కేసు నమోదు

గద్వాల క్రైం: పోలీసుశాఖ అనుమతి లేకుండా జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టిన వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం నడిగడ్డ హక్కుల పోరాట సమీతి ఆధ్వర్యంలో సీడ్‌పత్తి విత్తన పాకెట్ ధరలు పెంచాల్సిందిగా ఆ సంఘం నాయకులు గొంగళ్ల రంజిత్‌కుమార్, బుచ్చిబాబు, పలువురు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో రోడ్డు ఇరువైపుల వాహనాలు నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 30 యాక్టు అమల్లో ఉన్న క్రమంలో పోలీసుశాఖ అనుమతి తీసుకుని నిరసన, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించాల్సిందన్నారు. ఈ క్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు అనుమతి లేకుండా ధర్నా చేపట్టిన నేపథ్యంలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

రాజోళి: పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు, పశు సంవర్ధక శాఖ అధికారులు అన్నారు. సుంకేసుల డ్యాం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. 24 గంటల పాటు చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మరమ్మతు చేపట్టండి



అయిజ: మండలంలోని అయిజ– ఎక్లాస్‌పురం రోడ్డు శిథిలమై ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై కంకర తేలి ఉండడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురైతున్నట్లు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

కులవివక్ష పాటించడం నేరం



మల్దకల్: మండలంలోని కుర్తిరావల్‌చెర్వు గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. అతిథులుగా ఆర్‌ఐ మద్దిలేటి, హెడ్‌కానిస్టేబుల్ గోపాల్‌నాయక్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతిని అవలంభించడం, కులవివక్ష పాటించడం చట్టరీత్యా నేరమన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలసి జీవించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

ధరూరు: ఈ నెల 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా కార్యక్రమానికి అధికారులు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేశారు. జెండా కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరు కావాలని తహసీల్దార్ భూపాల్‌రెడ్డి, ఎంపీడీఓ మంజుల కోరారు. సోమవారం ఉదయం 8 గంటలకు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గణితంపై ఆసక్తి పెంపొందించాలి



అలంపూర్ చౌరస్తాలో శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

అలంపూర్: విద్యార్థుల్లో గణితం సబ్జెక్ట్‌పై ఆసక్తి పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల ముగింపు సమావేశానికి ప్రొఫెసర్ శనివారం హాజరయ్యారు. శిక్షణ తరగతులకు అలంపూర్, ఉండవెల్లి, మానవపాడు, ఇటిక్యాల, వడ్డేపల్లి మండలాల్లోని ఎస్జీటీలు 202 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గణితం జీవన విధానంలో ఎలా ముడిపడి ఉందో వివరించారు. పలు సందేహాలు నివృత్తి చేసి సూచనలు అందజేశారు. ఆర్పీలు ఆయా సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కోర్సు డైరెక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి శిక్షణ తరగతులు ఉపయోగడతాయన్నారు. పాత విధానాలకు స్వస్తి పలికి నూతన విధానంతో బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం హేమలత, ఆర్పీలు కర్రెప్ప, సుందర్‌రెడ్డి, కృష్ణ, రాఘవేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న పాలెం శాస్త్రవేత్తలు

ఎర్రవల్లి: పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చని పాలెం పరిశోధన స్థానం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి రైతువేదికలో పాలెం వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శాస్త్రవేత్తలు హాజరై.. రైతులకు పంటల యాజమాన్య పద్ధతులు, సాగులో తీసుకోవాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వర్షాధార వ్యవసాయంలో రైతులు నీటిని సంరక్షించుకోవాలన్నారు. పంట పొలాల చుట్టూ చెట్లను పెంచడం వల్ల అనేక లాభాలున్నాయన్నారు. యూరియా వాడకాన్ని, రసాయనిక మందులు సరైన మోతాదులో వాడాలన్నారు. ముఖ్యంగా విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను కొనుగోలు చేసిన రశీదులు పంట కాలం పూర్తయ్యే వరకు రైతులు తప్పకుండా భద్రపర్చుకోవాలని సూచించారు. అనంతరం పంట యాజమాన్య పద్ధతులకు సంబంధించిన కరపత్రాలను వ్యవసాయ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఓ రవి కుమార్, ఉద్యానశాఖ అధికారి ఇమానా, ఏఈఓలు, ఆయిల్‌ఫెడ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మన్నాపురంలో పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది



ఎర్రవల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

ఎర్రవల్లి: వర్షాకాలంలో పశువులకు సంక్రమించే సీజనల్ వ్యాధులపై పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి అన్నారు. పశువులు వ్యాధుల బారిన పడకుండా పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ముందస్తు టీకాల కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా 192 గేదెలు, 114 ఆవులకు టీకాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 27 నుంచి జూన్ 26 వరకు ప్రత్యేక టీకాల పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వినయ్‌కుమార్, సిబ్బంది మాసూమన్న, సబీనా, రామకృష్ణ, శ్రీరాములు, దేవన్న, భారతీ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలు

ధరూరు: లంపీ స్కిన్(ముద్ద చర్మ) వ్యాధి నివారణ టీకాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి వెంకటరాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని మన్నాపురం గ్రామంలో పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేసి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. పశువుల చర్మంపై గడ్డలు, జ్వరం, కణుపుల వాపు, శ్వాసకోశ, జీర్ణాశయంతర పేగుల్లో గడ్డలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే టీకాలను వేయించాలన్నారు. పేలు, దోమలు, ఈగలు వంటి కీటకాల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, పవన్, రషీద్, అనిల్, రైతులు పాల్గొన్నారు.

పులిగుట్టపై మైనింగ్ లీజు రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల శివారులో గల 'పులిగుట్ట' మైనింగ్ తవ్వకాలను ఆపడంతో పాటు మైనింగ్ లీజు రద్దు చేయాలంటూ గ్రామస్తులు శనివారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎంపీతో మాట్లాడుతూ గ్రామానికి అతి సమీపంలో గల పులిగుట్ట పక్కన మోడల్ స్కూల్ ఉండటంతో పాటు ఎనుకుంట రిజర్వాయర్ ఉందని, గుట్టపై వివిధ రకాల జంతువులు ఉన్నాయన్నారు. అంతే కాకుండా సమీపంలో నివాస గృహాలు సైతం ఉండటంతో మైనింగ్ తవ్వకాలు జరిపితే గ్రామస్తులకు, పాఠశాల విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని విన్నవించారు. ప్రత్యేక చొరవ తీసుకుని మైనింగ్ తవ్వకాలు వెంటనే ఆపడంతో పాటు మైనింగ్ లీజు రద్దు చేయించాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యను విన్న ఎంపీ డీకే అరుణ సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ రాజవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చీర్ల నర్సింహ, గ్రామ పెద్దలు కృష్ణయ్య, రామన్‌గౌడ్, విక్రమ్‌గౌడ్, ప్రకాష్, నగేష్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఆవరణలో కాలం చెల్లిన మందులు



సీఎస్‌సీ, పీహెచ్‌సీ ఆస్పత్రుల ఆవరణలో పారబోసిన మందులు, ఓఆర్‌ఎస్ పాకెట్లు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ఉన్న సీఎస్‌సీ, పీహెచ్‌పీ ఆస్పత్రుల ఆవరణల్లో ఎక్కడ చూసిన కాలం చెల్లిన మందు బిల్లలు, టానిక్ సీసాలు పారబోశారు. వాటిల్లో కొన్ని గడువు తేదీ ముగియని మందులు కూడా ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. మండల కేంద్రంలోని బస్టాండ్‌కు సమీపంలో ఆస్పత్రులు ఉండటం, పక్కనే ఇళ్లు, దుకాణాలు ఎక్కువగా ఉండటంతో చాలామంది ఆస్పత్రి ఆవరణలోకి వస్తుంటారు. చిన్న పిల్లలు సైతం ఆవరణలో ఆడుతుంటారు. అనారోగ్యం బారిన పడిన రోగులతో పాటు వారి వెంట కుటుంబ సభ్యులు ఆస్పత్రుల దగ్గరకు వస్తుంటారు. ఇలా ఎక్కడ పడితే అక్కడ కాలం చెల్లిన మందులు, టానిక్‌లు, సూదులు పడేస్తుండడంతో చిన్న పిల్లలు వాటితో ఆడుకుంటూ ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోగులకు మందులు ఇవ్వమంటే రెండు, మూడు మాత్రలు ఇచ్చి పంపిస్తున్న ఆస్పత్రి సిబ్బంది మందులను ఇలా వృథాగా పారబోయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సీఎస్‌సీ సూపరింటెండెంట్ పుల్లారెడ్డిని వివరణ కోరగా.. కాలం చెల్లిన మందులను బహిరంగ ప్రదేశాల్లో పారవేయకూడదని, వాటిని కాల్చడం, మందులు, టానిక్‌లు నీటిలో కలిపి పారబోయాలని అన్నారు. గడువు ముగియని మందులను ఎందుకు పారవేసిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.